# తెలంగాణ వెన్నెల వాక్కు

TGTEL/25/A0871

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక :50 03-09- 2026 శుక్రవారం పేజీలు: 4 వెల:03/-







# మంత్రి పదవి నుంచి

# కొండా సురేఖ ఔట్!



### రాజీనామాకు నిరాకరణ.. బర్తరఫ్ లేఖ గవర్నర్‌కు

హైదరాబాద్, సెప్టెంబర్ 3, తెలంగాణ వెన్నెల వాక్కు:
తెలంగాణ కాంగ్రెస్‌లో కొంతకాలంగా కొనసాగుతున్న అంతర్గత వివాదానికి కీలక మలుపు తిరిగింది. మంత్రి కొండా సురేఖను రాష్ట్ర మంత్రివర్గం నుంచి తొలగిస్తూ కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నట్లు తాజా సమాచారం. రాజీనామా చేయాలని అధిష్ఠానం సూచించినప్పటికీ ఆమె అందుకు అంగీకరించకపోవడంతో, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి బర్తరఫ్‌కు సంబంధించిన లేఖను గవర్నర్‌కు పంపినట్లు సమాచారం. దీంతో రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో కొండా సురేఖకు స్థానం లేకుండా పోయింది.

కొండా సురేఖ వ్యవహారం గత కొద్దిరోజులుగా తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర దుమారం రేపుతోంది. ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యలు, 2

## నేపాల్‌ను వీడని వరద బీభత్సం

### గల్లంతైన వారి కోసం ముమ్మర గాలింపు.. కొనసాగుతున్న సహాయక చర్యలు



కాఠ్మాండు, సెప్టెంబర్ 3:
నేపాల్‌లోని భోటే కోశీ నదిలో సంభవించిన భారీ వరదల ప్రభావం ఇంకా కొనసాగుతోంది. వరదల కారణంగా భారీగా నష్టం వాటిల్లగా, పలువురు గల్లంతైనట్లు అధికారులు గుర్తించారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం నేపాల్ ప్రభుత్వం సహాయక, గాలింపు చర్యలను ముమ్మరం చేసింది.

నేపాల్-చైనా సరిహద్దులోని రసువాగఢి ప్రాంతంలో ఆగస్టు 26న భోటే కోశీ నదికి ఒక్కసారిగా భారీ వరద వచ్చింది. వరద ఉద్ధృతికి రహదారులు, వంతెనలు, నిర్మాణాలు దెబ్బతినడంతో పాటు పలువురు గల్లంతయ్యారు. ఈ ఘటనను నేపాల్ విదేశాంగ మంత్రి అత్యంత తీవ్రమైన విపత్తుగా అభివర్ణించారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్నవారిని గుర్తించేందుకు నేపాల్ సైన్యం, 8

## క్షిపణి దాడిలో తెలంగాణ వాసి మృతి

### ఉక్రెయిన్‌లో విషాదం.. మరో వ్యక్తి సురక్షితం



హైదరాబాద్, సెప్టెంబర్ 3:
ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న యుద్ధ వాతావరణం తెలంగాణకు చెందిన ఓ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. రష్యా క్షిపణి దాడిలో జగిత్యాల జిల్లాకు చెందిన నిర్మాణ కార్మికుడు వావిలాల సుదర్శన్ మృతి చెందినట్లు సమాచారం. ఆయనతో కలిసి ఉక్రెయిన్‌కు వెళ్లిన మరో వ్యక్తి మాత్రం ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు.

సుదర్శన్ స్వగ్రామం జగిత్యాల జిల్లా హుస్నాబాద్‌గా సమాచారం. తాటిపల్లి 8

## నింగిలోకి జీఎస్ఎల్‌వీ--ఎఫ్17!

### భూ పరిశీలన ఉపగ్రహ ప్రయోగానికి ఇస్రో సిద్ధం



శ్రీహరికోట, సెప్టెంబర్ 3:
భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ మరో ప్రతిష్ఠాత్మక ప్రయోగానికి సిద్ధమైంది. భూ పరిశీలన ఉపగ్రహం ఈఓఎస్--05ను నింగిలోకి తీసుకెళ్లనున్న జీఎస్ఎల్‌వీ--ఎఫ్17 రాకెట్ ప్రయోగానికి కౌంట్‌డౌన్ కొనసాగుతోంది. సెప్టెంబర్ 4న తెల్లవారుజామున 2.55 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష 7

## మరణంపై మళ్లీ న్యాయ వైద్య పరీక్ష!

### తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు




హైదరాబాద్, సెప్టెంబర్ 3:
ఒక వ్యక్తి మృతికి సంబంధించిన కేసులో తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. మరణానికి దారితీసిన పరిస్థితులపై మరింత స్పష్టత కోసం మరోసారి నిపుణుల న్యాయ వైద్య అభిప్రాయం తీసుకోవాలని వరంగల్ పోలీసులను ఆదేశించింది. దీంతో ఇప్పటికే దర్యాప్తులో ఉన్న ఈ కేసు మరోసారి కీలక 5






## కేటీఆర్ హెచ్చరిక..

### సెప్టెంబర్ 14లోపు నీళ్లివ్వకపోతే కోదాడ నుంచి హాలియా వరకు భారీ పాదయాత్ర



నల్లగొండ బ్యూరో
ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మిర్యాలగూడలో నిర్వహించిన ప్రతిష్టాత్మక రైతు ధర్నా మరియు భారీ బహిరంగ సభలో బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారకరామారావు (కేటీఆర్) పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# కోరుకున్నదాని కంటే.. ఉన్నదే గొప్ప వరం

మనిషి జీవితంలో కోరికలకు అంతం ఉండదు. చిన్నప్పుడు ఒక కోరిక.. పెద్దయ్యాక మరో కోరిక.. ఉద్యోగం వచ్చిన తర్వాత మంచి జీతం కావాలి.. అది వచ్చిన తర్వాత సొంత ఇల్లు కావాలి.. ఇల్లు వచ్చిన తర్వాత మరింత సౌకర్యం కావాలి. ఒక కోరిక నెరవేరగానే మరో కోరిక మనసు తలుపు తడుతుంది. ఈ పరుగులో మనిషి ఒక విషయం మాత్రం మర్చిపోతున్నాడు.. తన దగ్గర ఇప్పటికే ఉన్నది ఎంత గొప్ప వరమో.

దేవుడి ముందు నిలబడినప్పుడు మనం ఎక్కువగా కోరుకునేది మనకు లేనిదే. ఆరోగ్యం కావాలి, సంపద కావాలి, పిల్లలకు మంచి భవిష్యత్తు కావాలి, కుటుంబంలో సంతోషం ఉండాలి అని ప్రార్థిస్తాం. కోరికలు కోరుకోవడం తప్పు కాదు. కానీ ఒకసారి మనం వెనక్కి తిరిగి చూసుకుంటే.. దేవుడు ఇప్పటికే మనకు ఇచ్చిన ఎన్నో వరాలు కనిపిస్తాయి.

మనతో ఉన్న తల్లిదండ్రులు, మన కోసం ఎదురుచూసే కుటుంబం, మన మాట వినే పిల్లలు, కష్టంలో అండగా నిలిచే ఒక మనిషి, ఆరోగ్యంగా మరో ఉదయం చూడగలగడం.. ఇవన్నీ మన జీవితంలో ఉన్న గొప్ప సంపదలు. వీటికి మనం ధర నిర్ణయించలేం. అయినా అవి మన దగ్గర ఉన్నంతకాలం వాటి విలువను గుర్తించకుండా.. మనకు లేనిదాని గురించే ఆలోచిస్తూ ఉంటాం.

మనిషి స్వభావమే అలాంటిది. తన దగ్గర ఉన్నదానికంటే పక్కవాడి దగ్గర ఉన్నదే ఎక్కువగా కనిపిస్తుంది. ఇతరుల ఇల్లు చూసి తన ఇల్లు చిన్నదనిపిస్తుంది. ఇతరుల సంపద చూసి తన జీవితం తక్కువగా అనిపిస్తుంది. మరొకరి సౌకర్యాలను చూసి తన దగ్గర ఉన్న ఆనందాన్ని మర్చిపోతాడు. పోలిక మొదలైన చోట సంతృప్తి తగ్గుతుంది. సంతృప్తి తగ్గిన చోట ఎంత ఉన్నా మనసుకు తృప్తి ఉండదు. ఆధ్యాత్మికత మనిషికి అందుకే కృతజ్ఞతను నేర్పుతుంది. "ఇది నాకు ఎందుకు లేదు?" అనే ప్రశ్నతో పాటు "ఇంత ఇచ్చినందుకు ధన్యవాదాలు" అనే మాట కూడా మనసులో రావాలి. దేవుడిని కేవలం కోరికలు తీర్చే శక్తిగా చూడకుండా.. మన జీవితంలో ఇప్పటికే ఉన్న మంచిని గుర్తించే జ్ఞానాన్ని ఇచ్చే దైవంగా భావించాలి.

కష్టాలు లేని జీవితం ఎవరికీ ఉండదు. మనకు ఉన్న సమస్యలు మనకే పెద్దవిగా అనిపిస్తాయి. కానీ కొంతసేపు మన చుట్టూ చూస్తే.. మనకంటే ఎన్నో కష్టాల్లో ఉన్నవారు కనిపిస్తారు. అయినా వారు ఆశను వదలకుండా జీవిస్తున్నారు. అప్పుడే మన దగ్గర ఉన్న చిన్న సంతోషాల విలువ అర్థమవుతుంది. ఒక ఆరోగ్యమైన ఉదయం, కుటుంబంతో కలిసి భోజనం, మనస్ఫూర్తిగా నవ్వే అవకాశం.. ఇవన్నీ నిజానికి చిన్న విషయాలు కావు.

రేపటి కోసం కష్టపడటం అవసరం. భవిష్యత్తు కోసం కలలు కనడం కూడా అవసరం. కానీ రేపటి కోసం పరుగెత్తుతూ ఈరోజు మనకు దొరికిన ఆనందాన్ని కోల్పోకూడదు. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడు వారి బాల్యాన్ని ఆస్వాదించాలి. తల్లిదండ్రులు మనతో ఉన్నప్పుడు వారి మాట వినాలి. మనతో ఉన్న మనుషులకు మన ప్రేమను తెలియజేయాలి. ఎందుకంటే డబ్బుతో ఎన్నో వస్తువులు తిరిగి కొనగలం.. కానీ గడిచిపోయిన సమయాన్ని మాత్రం తిరిగి కొనలేం.

దేవుడి ముందు చేతులు జోడించినప్పుడు ఒకసారి మన ప్రార్థనను మార్చి చూడాలి. "నాకు ఇది ఇవ్వు.. అది ఇవ్వు" అనే కోరికలతో పాటు.. "నాకు ఇప్పటికే ఉన్న వాటి విలువను గుర్తించే మనసు ఇవ్వు. ఉన్నదానితో సంతోషంగా ఉండే జ్ఞానం ఇవ్వు. కష్టాల్లో ధైర్యంగా నిలబడే శక్తి ఇవ్వు" అని కోరితే.. ఆ ప్రార్థన మన జీవితాన్నే మార్చగలదు.

మనకు లేనిదాని కోసం దేవుడిని అడగడం సహజం.. కానీ మనకు ఉన్నదాని కోసం దేవుడికి కృతజ్ఞత చెప్పడం గొప్ప భక్తి. కోరుకున్నది దొరికితే సంతోషం వస్తుంది.. కానీ ఉన్నదే వరమని తెలుసుకున్నప్పుడు ప్రతి రోజూ సంతోషంగా జీవించగలం.



--- సీనియర్ జర్నలిస్ట్
యోగేష్ కుమార్

## మంత్రి పదవి నుంచి కొండా సురేఖ ఔట్!

అనంతరం కొండా సురేఖ చేసిన రాజకీయ వ్యాఖ్యలు వివాదానికి కేంద్రంగా మారాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై ఆమె చేసిన వ్యాఖ్యలు పరిస్థితిని మరింత తీవ్రం చేశాయి. తనపై చర్యలు తీసుకునే ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపైనా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేయడం కాంగ్రెస్‌లో సంచలనంగా మారింది.

ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ సిఫారసులు, రాష్ట్ర పార్టీ నాయకత్వం ఇచ్చిన నివేదికలను అధిష్ఠానం పరిశీలించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు ఢిల్లీలో పార్టీ అగ్రనేతలతో సమావేశమై కొండా సురేఖ వ్యవహారంపై చర్చించినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. మరోవైపు కొండా సురేఖ మాత్రం తనపై చర్యలు తీసుకోవడం అన్యాయమని వాదించారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, తనకు వివరణ ఇచ్చే అవకాశం కూడా ఇవ్వలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసినట్లు తాజా సమాచారం. బర్తరఫ్ అనంతరం కూడా ఆమె ఈ నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. ఇదిలా ఉండగా, కొండా సురేఖ వ్యవహారంతో పాటు కాంగ్రెస్‌లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ పదవి నుంచి జి. చిన్నారెడ్డిని కూడా తొలగించినట్లు సమాచారం. ఆయన స్థానంలో గద్వాల విజయలక్ష్మిని నియమించినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణి నియామకాలు కూడా వెలువడ్డాయి.

కాంగ్రెస్‌లో కొనసాగుతానన్న సురేఖ.. మంత్రి పదవికి మాత్రం గుడ్‌బై

మంత్రి పదవి నుంచి తొలగింపు జరిగినప్పటికీ కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీని వీడతారా? లేక పార్టీలోనే కొనసాగుతూ రాజకీయంగా తన పోరాటాన్ని కొనసాగిస్తారా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పార్టీని వీడకుండా కాంగ్రెస్‌లోనే కొనసాగితే.. ఆమె తదుపరి రాజకీయ అడుగులు ఎలా ఉంటాయన్న దానిపై రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. మొత్తంగా చూస్తే.. కొండా సురేఖ వ్యవహారం ఇప్పుడు వ్యక్తిగత వివాదాన్ని దాటి తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత క్రమశిక్షణ, నాయకత్వం, వర్గ విభేదాల అంశంగా మారింది. తాజా బర్తరఫ్ నిర్ణయం అనంతరం కాంగ్రెస్‌లో ఈ పరిణామాలు ఎలాంటి రాజకీయ ప్రభావాన్ని చూపుతాయన్నది రాబోయే రోజుల్లో తేలనుంది.

# కార్మిక కుటుంబాలకు కొత్త భరోసా

## పిల్లలకు విదేశీ ఉద్యోగ అవకాశాలు.. జిల్లాలో 21,459 మంది కార్మికులు

నిర్మల్, సెప్టెంబర్ 3: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమంతో పాటు వారి కుటుంబాలకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కార్మిక శాఖ అధికారి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ముత్యం రెడ్డి తెలిపారు. తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పరిధిలో నమోదైన కార్మికుల పిల్లలకు విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రికగ్నిషన్ ఆఫ్ ప్రియర్ లెర్నింగ్ కార్యక్రమం ద్వారా ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.

18 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగిన నమోదిత భవన నిర్మాణ కార్మికుల పిల్లలు, ఆధారపడిన వారు ఈ అవకాశానికి అర్హులని ముత్యం రెడ్డి తెలిపారు. కనీసం ఎనిమిదో తరగతి లేదా ఆపై విద్యార్హత కలిగి ఉండటంతో పాటు ప్రాథమిక కమ్యూనికేషన్ నైపుణ్యాలు, విదేశాల్లో పనిచేయాలనే ఆసక్తి ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. అర్హులైన అభ్యర్థుల పేరు, ఆధార్ సంఖ్య, మొబైల్ నంబర్, విద్యార్హత, వృత్తి తదితర వివరాలతో జిల్లా స్థాయి సమాచారాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు.

**జిల్లాలో 21,459 మంది కార్మికుల నమోదు**

నిర్మల్ జిల్లాలో భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పరిధిలో ఇప్పటివరకు 21,459 మంది కార్మికులు నమోదయ్యారని ముత్యం రెడ్డి తెలిపారు. వీరిలో 13,940 మంది పురుషులు, 7,519 మంది మహిళలు ఉన్నారని పేర్కొన్నారు. నిర్మల్ సర్కిల్‌లో 10,034 మంది, భైంసా సర్కిల్‌లో 11,425 మంది కార్మికులు నమోదై ఉన్నారని వివరించారు.



కార్మిక సంక్షేమ పథకాల ద్వారా జిల్లాలో అనేక కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించినట్లు ఆయన తెలిపారు. ప్రసవ సాయం కింద నిర్మల్, భైంసా సర్కిళ్లలో కలిపి 1,421 మంది, వివాహ కానుక కింద 469 మంది లబ్ధి పొందారని చెప్పారు. సహజ మరణం, దహన సంస్కారాల ఖర్చుల కింద 153 కుటుంబాలకు, ప్రమాద మరణాలకు సంబంధించి 9 కేసుల్లో పరిహారం మంజూరైనట్లు వెల్లడించారు. డిస్ట్రెస్ రిలీఫ్ కింద నిర్మల్ సర్కిల్‌లో నలుగురికి ఆర్థిక సహాయం అందించిన్నారు.

**గల్ఫ్ కార్మికుల పునరావాసానికి ప్రత్యేక చర్యలు**

విదేశాల్లో పనిచేస్తున్న గల్ఫ్ కార్మికులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, పునరావాస ప్రక్రియకు ప్రత్యేక దృష్టి సారించినట్లు ముత్యం రెడ్డి తెలిపారు. గల్ఫ్ మైగ్రెంట్ వర్కర్స్ సెల్ ద్వారా సమస్యలను స్వీకరించి సంబంధిత విభాగాలతో సమన్వయం చేస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

గల్ఫ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నుంచి నిర్మల్ జిల్లా వెంకటాపూర్‌కు చెందిన గడ్డం ద నరేష్ పునరావాస ప్రక్రియలో ఎంతో సహకరిస్తున్నారని తెలిపారు. అలాగే స్వదేశీ పరికిపండ్ల కూడా గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారంలో సహకరిస్తున్నారని పేర్కొన్నారు.

అదేవిధంగా సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)లోని ప్రత్యేక సెల్ ద్వారా ఈమెయిల్స్, ఇతర సమాచార మార్పిడి సమర్థవంతంగా జరుగుతోందని ముత్యం రెడ్డి తెలిపారు. గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మికులు, వారి కుటుంబాలకు అవసరమైన సమాచారాన్ని సంబంధిత విభాగాలకు చేరవేస్తూ సమన్వయంతో పరిష్కార చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

**ఇతర రంగాల కార్మికులకూ సంక్షేమం**

నిర్మాణ రంగ కార్మికులతో పాటు గిగ్ కార్మికులు, గృహ కార్మికులు, వ్యవసాయ కార్మికులకు కూడా సంక్షేమ ఫలాలు అందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ముత్యం రెడ్డి తెలిపారు. అర్హులైన కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## నిర్మల్ జిల్లా పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవం

నిర్మల్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా పోలీస్ అధికారుల సంఘం ఎన్నికలు గురువారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన భైంసా ఏఎస్పీ పత్తిపాక సాయికిరణ్ ఐపీఎస్ పర్యవేక్షణలో నూతన కార్యవర్గాన్ని సామరస్యపూర్వకంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా దండేకర్ సాయి (కానిస్టేబుల్), ఉపాధ్యక్షులుగా కృష్ణ (ఇన్‌స్పెక్టర్), సాయికృష్ణ (ఆర్ఎస్ఐ), ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్ (ఎస్సై), ఆర్గనైజింగ్ సెక్రటరీగా రామ్ నిరంజన్ (ఆర్ఐ), జాయింట్ సెక్రటరీగా సంతోష్ (కానిస్టేబుల్), కోశాధికారిగా మాధవ్ (కానిస్టేబుల్) ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా మహేందర్ రెడ్డి, సాయికిరణ్ జాదవ్, శంభు, గంగాధర్, పెర్సిస్, టి.వి. రమణ ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియను స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఐపీఎస్ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ సిబ్బంది, వారి కుటుంబాల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించేందుకు, సంక్షేమాన్ని కాపాడేందుకు అసోసియేషన్ సమన్వయంతో కృషి చేయాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో యూనస్ అలీ, సీఐలు కృష్ణ, ప్రవీణ్, సాయికుమార్, గోవర్ధన్ రెడ్డి, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.













## విజేత పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు




దిలావర్‌పూర్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని విజేత ఉన్నత పాఠశాలలో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను గురువారం అత్యంత కోలాహలంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై చిన్నారులు బాలకృష్ణుడు, గోపికల వేషధారణలతో చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, భక్తిగీతాల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల ఆవరణలో సాంప్రదాయబద్ధంగా ఏర్పాటు చేసిన ఉట్టిని గోపికల కేరింతల నడుమ శ్రీకృష్ణుడి వేషధారణలో ఉన్న చిన్నారి శర్వాన్ష్ కొట్టడంతో ప్రాంగణమంతా హర్షధ్వానాలతో మార్మోగింది. విద్యార్థులకు భారతీయ సనాతన సంస్కృతి, పండుగల విశిష్టతను తెలియజేయడానికే ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుఖేష్, సతీష్, నవీన్, సురేష్, రాజశేఖర్, కల్పన, ప్రతిభ, భారతి, నాగమణి, సుమలత, అయేషా, మమత, శరణ్య, అనుజ, స్నేహ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కదిలి పాపారేశ్వర ఆలయంలో ఘనంగా శివపురాణ ప్రవచనాలు

దిలావర్‌పూర్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): దిలావర్‌పూర్ మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కదిలి మాతా అన్నపూర్ణ సమేత పాపారేశ్వర ఆలయంలో గురువారం మహాశి వపురాణ ప్రవచనాలు వైభవంగా ప్రారంభ మయ్యాయి. అల్లోల అపర్ణ ప్రశాంత్ రెడ్డి దంపతుల సౌజన్యంతో ఈ నెల 9వ తేదీ వరకు ఏడు రోజుల పాటు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసా గనున్నాయి. ప్రవచనకర్త విలాస్ శర్మ భక్తులకు శివపురాణ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా పాపారే శ్వరునికి దంపతులు శాస్త్రోక్తంగా ప్రత్యే క రుద్రాభిషేకం, అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర కిన్వాట్ ప్రాంతానికి చెందిన పీఠాధిపతి శ్రీశ్రీ గంగేశ్వర మహారాజ్ విచ్చేసి యాగశాలను పరిశీలించి దాతలను ఆశీర్వదించారు. అనంతరం మహిళలు శివనామస్మరణతో చేసిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేష్, ప్రధానార్చకులు మాధవరావు, ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రావు, ధర్మకర్తలు సప్పల రవి, ప్రతిభ, రమేష్, అనురాధ, దత్తురాం పటేల్, భుజంగరావు, సాంబాజీ పటేల్, మాడేగాం సర్పంచ్ మారుతి పటేల్, కుస్టీ, కదిలి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






## బాసరలో వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన సంబరాలు



బాసర, సెప్టెంబర్ 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా బాసర మండల కేంద్రంలో డీసీసీ జిల్లా ఉపాధ్యక్షులు మమ్మాయి రమేష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సంబరాలు ఘనంగా నిర్వహించాయి. అనంతరం ఆయన ప్రజా పాలన ఉత్సవాల్లో భాగంగా స్థానిక బాసర గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని స్వయంగా సందర్శించి ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి ఎద్దడి, అసంపూర్తి అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్య సమస్యలపై వినతులను స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. పరిపాలనను ప్రజల ముంగిటకు చేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన పేదలకు ఆరు గ్యారెంటీలు అందేలా పార్టీ కార్యకర్తలు బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. అలాగే ఎస్ఐఆర్ ఓటరు జాబితా సవరణలో అర్హులైన పౌరుల ఓట్లు తొలగకుండా అధికారులు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ తోటల్లో రైనోసెరస్ బీటిల్ నివారణకు ఫెరోమోన్ బుట్టలు




దిలావర్‌పూర్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): గ్రామీణ వ్యవసాయ అవగాహన అనుభవ కార్యక్రమం (రావెప్)లో భాగంగా నిర్మల్ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె. రాహుల్ విశ్వకర్మ దిలావర్‌పూర్ మండలంలోని గుండంపల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని ఆయిల్‌పామ్ తోటల్లో విస్తారంగా వ్యాపిస్తున్న రైనోసెరస్ బీటిల్ (కొమ్ము పురుగు) నివారణ కోసం రైతులకు క్షేత్రస్థాయిలో ఫెరోమోన్ ట్రాప్స్‌ను అమర్చి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ చెట్ల సుడులను తొలిచి తీవ్ర నష్టం కలిగించే కొమ్ము పురుగులను ఫెరోమోన్ లింకుల ద్వారా ఆకర్షించి సమర్థవంతంగా అరికట్టవచ్చని రైతులకు వివరించారు. తోటల యజమానులు శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. ఈ క్షేత్ర ప్రదర్శనలో రావెప్ వ్యవసాయ కళాశాల విద్యార్థులతో పాటు స్థానిక రైతు భూచారెడ్డి, గ్రామ రైతులు పాల్గొని ట్రాప్స్ ఏర్పాటు చేసే విధానాన్ని పరిశీలించారు.






తెలంగాణ వెన్నెల వాక్కు జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871


## రైతులంతా క్రాప్ సర్వేలో పంటల వివరాలు నమోదు చేసుకోవాలి



సారంగాపూర్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): జిల్లాలోని రైతులందరూ తమ సాగు వివరాలను క్రాప్ సర్వేలో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా స్పష్టం చేశారు. సారంగాపూర్ మండలం గోపాల్‌పేట్ శివారులో జరుగుతున్న క్రాప్ సర్వేను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటల వివరాలు నమోదైతేనే ధాన్యం విక్రయాలు, ప్రభుత్వ రాయితీలు అందుతాయన్నారు. సిబ్బంది రైతుల సమక్షంలోనే వాస్తవ సాగు వివరాలు నమోదు చేయాలని, పొరపాట్లకు తావులేకుండా చూడాలని ఆదేశించారు. సర్వే వేగవంతానికి పదో తరగతి పాసైన స్థానిక యువతను వాలంటీర్లుగా నియమించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, ఎంపీవో అజీజ్ ఖాన్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.




# ధిక్కార స్వరం -- విచ్ఛిన్న పాలన!

## కాంగ్రెస్‌లో మళ్లీ పాత రోగం!



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
విశ్లేషణ 9848559863

పదేళ్ల సుదీర్ఘ నిరీక్షణ, ఎన్నో ఓటములు, మరెన్నో అవమానాలు మరియు సుదీర్ఘ పోరాటాల తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికార పీఠాన్ని అధిరోహించింది. సుదీర్ఘ కాలం పాటు ప్రతిపక్షంలో మగ్గిపోయిన నాయకులకు తెలంగాణ ప్రజలు ఒక అరుదైన, గొప్ప అవకాశాన్ని ఇచ్చారు. కానీ, అధికారం చేపట్టిన అత్యల్ప కాలంలోనే ఆ పార్టీలోని సీనియర్ నాయకులు ప్రదర్శిస్తున్న తీరు, పదవుల కోసం సాగిస్తున్న వీధి రచ్చ సమస్త ప్రజాస్వామ్య వ్యవస్థనే సిగ్గుపడేలా చేస్తోంది. ప్రభుత్వం సాధించిన విజయాలను, అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం పూర్తిగా విడిచిపెట్టి, అంతర్గత కలహాలు, అధిపత్య పోరు, ఒకరిపై ఒకరు బహిరంగంగా చేసుకొనే తీవ్రస్థాయి ఆరోపణలతో నిత్యం వార్తల్లో నిలవడం ప్రజాస్వామ్యానికే పెను ప్రమాదంగా మారింది. అధికారంలోకి వచ్చామన్న ఆనందం కంటే, ఆశించిన పదవులు దక్కలేదన్న అసంతృప్తి, ఉన్న పదవులను ఎలాగైనా కాపాడుకోవాలనే స్వార్థ తాపత్రయమే కాంగ్రెస్ నాయకుల్లో ఎక్కువగా కనిపిస్తోంది. సొంత పార్టీ మంత్రులు, ప్రజాప్రతినిధులు బహిరంగంగా ధిక్కార స్వరం వినిపిస్తుంటే, ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు ఉచితంగా లభించిన ఈ రాజకీయ అవకాశాన్ని చూసి సంబరపడుతున్నాయి.

ప్రజాస్వామ్య వ్యవస్థలో మంత్రులకు, ప్రజాప్రతినిధులకు ప్రజల పట్ల ఒక ప్రత్యేక బాధ్యత ఉంటుంది. వారు కేవలం తమ సొంత నియోజకవర్గానికో లేదా తమ వర్గానికో ప్రతినిధులు కారు; మొత్తం ప్రభుత్వ ప్రతిష్టకు, ప్రజల నమ్మకానికి అద్దం పట్టేవారు. కానీ ప్రస్తుత పరిస్థితిని చూస్తే, ప్రభుత్వంపై, స్వపక్ష ముఖ్యమంత్రిపైనే తీవ్రస్థాయిలో నిందలు వేస్తూ, మళ్లీ అదే ప్రభుత్వంలో మంత్రి పదవుల్లో రొమ్ము విరుచుకుని కూర్చోవడం ఏ రకమైన రాజకీయ నైతికత కిందకు వస్తుందో ఆ నేతలకే తెలియాలి. 'మంత్రి పదవికి రాజీనామా చేయను' అంటూ కొండా సురేఖ వంటి నేతలు భీష్మించుకుని కూర్చోవడం, కేబినెట్ విస్తరణ పేరుతో తమ వర్గానికి పదవులు ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని పరోక్షంగా హెచ్చరించడం వంటి పరిణామాలు కాంగ్రెస్ పార్టీ పాత రోగాన్ని మళ్లీ తిరగదోడుతున్నాయి. కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి సీనియర్ నేతల చుట్టూ తిరుగుతున్న పదవుల వ్యవహారాలు, కేబినెట్ మార్పుల పుకార్లు పార్టీని మరింత గందరగోళంలోకి నెట్టేస్తున్నాయి. మాట్లాడే ముందు కనీస బాధ్యత లేదా, ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నామనే స్పృహ లేదా అనే తీవ్రమైన ప్రశ్నలు సామాన్య పౌరుల నుంచి వ్యక్తమవుతున్నాయి. పదేళ్ల పాటు అధికారానికి దూరంగా ఉండి, ఎన్నో కష్ట నష్టాలకోర్చి మళ్లీ అధికారంలోకి వచ్చాక, ఆ ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యతను గాలికి వదిలేసి, స్వార్థ ప్రయోజనాల కోసం వీధిపోరాటాలకు దిగడం అత్యంత విచారకరం.

కాంగ్రెస్ అధిష్టానం కేబినెట్ పునర్వ్యవస్థీకరణ చేయడం ద్వారా ఈ సంక్షోభాన్ని సమసిపోయేలా చేయవచ్చని భావిస్తుంటే అది కేవలం ఒక భ్రమ మాత్రమే అవుతుంది. పదవులు రాని వారిని సముదాయించడానికి లేదా అసంతృప్తులను చల్లార్చడానికి కేబినెట్ మార్పులు చేయడం వల్ల తాత్కాలికంగా శబ్దం తగ్గుతుందేమో కానీ, లోపల రగులుతున్న అసంతృప్తి జ్వాలలు ఆరవు. ఒకరిని తప్పించి మరొకరికి పీఠం వేయడం వల్ల, పదవి పోయినవారు మరింత ఉగ్రరూపం దాల్చి ధిక్కార స్వరాన్ని పెంచే ప్రమాదం ఉంది. అసలు సమస్య పదవుల పంపకంలో లేదు, నాయకుల్లో ఉన్న క్రమశిక్షణా రాహిత్యంలో ఉంది. దశాబ్దాలుగా కాంగ్రెస్ సంస్కృతిగా వస్తున్న 'అందరూ నాయకులే, ఎవరికీ ఎవరూ లోకువ కాదు' అనే భావనే నేడు ఆ పార్టీ మనుగడను ముంచేస్తోంది. ఈ ధోరణిని కఠినంగా అణచివేయకుండా, సర్దుబాటు రాజకీయాలతో ముందుకు వెళ్లాలని చూస్తే, అది కాంగ్రెస్ తన సొంత గోతిని తానే తవ్వుకోవడమే అవుతుంది .ఇటువంటి అంతర్గత వైషమ్యాలు, పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే వాతావరణం ప్రతిపక్షాలకు ఆయుధాలను అందించడమే కాకుండా, ప్రజల్లో ప్రభుత్వం పట్ల ఉన్న నమ్మకాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయి. ప్రజలు తమ సమస్యలు తీరుస్తారని, సంక్షేమాన్ని అందిస్తారని నమ్మి ఓట్లు వేస్తే, నాయకులు మాత్రం తమ వ్యక్తిగత అజెండాలు, పదవుల పరుగు పందెంలో మునిగి తేలుతున్నారు. ఈ తరహా కుమ్ములాటలు ఇలాగే కొనసాగితే, రాబోయే రోజుల్లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో, కనీసం గ్రామ స్థాయిలో సర్పంచ్ పదవులను కూడా గెలుచుకోలేని దయనీయ స్థితికి పార్టీ దిగజారిపోతుంది. సొంత నేతలే ప్రభుత్వాన్ని ఆక్షేపిస్తుంటే, ప్రజలు ఆ ప్రభుత్వాన్ని ఎలా నమ్ముతారు? ప్రత్యర్థి పార్టీలు చేసే విమర్శలకు కాంగ్రెస్ నేతలే బలాన్ని చేకూరుస్తుంటే, రేపు ఎన్నికల బరిలోకి దిగినప్పుడు ప్రజలకు ఏం సమాధానం చెబుతారు?ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ప్రభావం ఎంతగానో ఉంది. ప్రత్యర్థి పార్టీలు చాలా ప్రణాళికాబద్ధంగా, బలమైన సోషల్ మీడియా నెట్‌వర్క్ ద్వారా ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తుంటాయి. అలాంటప్పుడు కాంగ్రెస్ పార్టీ చేయాల్సింది అంతర్గత పోరు కాదు; ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను, అమలు చేస్తున్న హామీలను ప్రచారంలోకి తీసుకెళ్లడం. విమర్శలను తిప్పికొడుతూ, నిజాలను ప్రజలకు వివరించేలా బలమైన ప్రచార వ్యూహాన్ని అమలు చేయాలి. కానీ దానికి భిన్నంగా, సొంత పార్టీ నేతలే సోషల్ మీడియాకు, మీడియాకు ఎక్కి ప్రభుత్వంపై వ్యాఖ్యలు చేయడం వల్ల పార్టీ స్వయంగా ప్రతిపక్షాలకు కావలసినంత సమాచారాన్ని, అవకాశాలను థాళీలో పెట్టి ఇస్తోంది.అధికారం అనేది శాశ్వతం కాదు, అది ప్రజలు ఇచ్చిన తాత్కాలిక బాధ్యత మాత్రమే. ఆ బాధ్యతను విస్మరించి, పదవుల కోసం ఎంతటికైనా దిగజారే రాజకీయం చేయడం వల్ల నాయకులు తమ వ్యక్తిగత ప్రతిష్టను కోల్పోవడమే కాకుండా, పార్టీ భవిష్యత్తును కూడా ప్రమాదంలో పడేస్తున్నారు. 2029లో మళ్లీ అధికారాన్ని నిలబెట్టుకోవాలనే ఆలోచన కాంగ్రెస్‌కు ఉంటే, తక్షణమే ఈ అంతర్గత కలహాలకు చరమగీతం పాడాలి. అధిష్టానం ఉపేక్షించే ధోరణిని వీడి, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించేవారు ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తీసుకోవాలి. పదవుల ఆశను పక్కనబెట్టి, ప్రభుత్వం సాధిస్తున్న విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడమే కాంగ్రెస్ ముందున్న ఏకైక మార్గం. అలా కాకుండా, పాత రాజకీయ సంస్కృతినే కొనసాగిస్తూ, ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ కాలం వెళ్లదీస్తే, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు శాశ్వతంగా దూరమయ్యే ప్రమాదం ఉంది.

## కేటీఆర్ హెచ్చరిక..

నాగార్జునసాగర్ ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయడంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆయన నిప్పులు చెరిగారు. తెలంగాణ వ్యాప్తంగా రైతాంగం తీవ్ర నిరాశానిస్పృహల్లో ఉందని, ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలో ఎండిపోతున్న పంటల పరిస్థితిని చూస్తుంటే గుండె తలుక్కుమంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అలసత్వాన్ని నిరసిస్తూ కేటీఆర్ సభ వేదికగా ఒక సంచలన ప్రకటన చేశారు. సెప్టెంబర్ 14వ తేదీ లోగా నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద ఉన్న చివరి ఆయకట్టు భూములకు తక్షణమే సాగునీరు విడుదల చేయకపోతే, తానే స్వయంగా ప్రజాక్షేత్రంలోకి దిగి కోదాడ నియోజకవర్గం నుంచి ప్రారంభించి హాలియా వరకు భారీ ఎత్తున పాదయాత్ర చేపడతానని చాలా స్పష్టంగా స్పష్టం చేశారు. రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు, ఎండిపోతున్న చివరి ఎకరం వరకు సాగునీరు అందే వరకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి తమ పోరాటాన్ని ఆపేది లేదని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వానికి అత్యంత స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. మిర్యాలగూడ బహిరంగ సభలో హాజరైన వేలాది మంది ప్రజలు మరియు రైతులను ఉద్దేశించి మాట్లాడిన కేటీఆర్, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అతి స్వల్ప కాలంలోనే సమర్థవంతమైన పాలన అందించడంలో విఫలమై ఇటు రైతులను, అటు సామాన్య ప్రజలను తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టివేసిందని ఆరోపించారు.




## అంగన్వాడీలలో చిన్నారులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలి:



నిర్మల్ రూరల్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి తోడ్పడేలా ఆహ్లాదకర వాతావరణం, మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. నిర్మల్ గ్రామీణ మండలం రత్నాపూర్ కాండ్లి అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహార రికార్డులను పరిశీలించారు. పోషకాహార లోపం ఉన్న సామ్, మామ్ చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించి అదనపు పోషకాహారం అందించాలన్నారు. కేంద్రాలను బొమ్మలు, విద్యా చార్టులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. చిన్నారులతో ముచ్చటించి చాక్లెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వినూత్న, అధికారులు పవన్ కుమార్, సౌమ్య, సర్పంచ్ హరీష్, ఉపసర్పంచ్ భూమేష్ పాల్గొన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER




## ఏఎన్‌ఎంల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి: సీఐటీయూ డిమాండ్



నిర్మల్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలపై అధిక పని ఒత్తిడిని తగ్గించి వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రికార్డుల పేరుతో వేధింపులు ఆపాలని, ప్రభుత్వ ఖర్చుతో ఎల్‌హెచ్‌వీ శిక్షణ ఇప్పించి పెండింగ్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని కోరారు. అర్హులైన వారికి సూపర్ వైజర్ ప్రమోషన్లు కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 1,931 ఏపీహెచ్‌ఏ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆభా లింకింగ్ నిబంధనను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సెకండ్ ఏఎన్‌ఎం యూనియన్ జిల్లా నాయకులు లక్ష్మి, రాధ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

## వీధి వ్యాపారుల అభ్యున్నతికే 'లోక్ కళ్యాణ్ మేళా': లీడ్ బ్యాంక్ మేనేజర్




భైంసా, సెప్టెంబర్ 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): వీధి వ్యాపారులను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు పీఎం స్వనిధి పథకం కింద లోక్ కళ్యాణ్ మేళా నిర్వహిస్తున్నట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్ తెలిపారు. భైంసా మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు దేశవ్యాప్తంగా ప్రత్యేక స్వనిధి ప్రచారం సాగుతుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన చిరు వ్యాపారులందరికీ వివిధ బ్యాంకుల ద్వారా రాయితీ రుణాలు మంజూరు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. చిరు వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు కుమార్, నరేష్ బాబు, ప్రియమ్‌జీత్ సింగ్, తిరుపతి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వైఫల్యాలపై లోకేశ్వరంలో బీఆర్ఎస్ పార్టీ ధర్నా




లోకేశ్వరం, సెప్టెంబర్ 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వ్యవసాయ హామీలను తుంగలో తొక్కి రైతాంగాన్ని మోసం చేసిందని ఆరోపిస్తూ మండల కేంద్రంలో బీఆర్ ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సకాలంలో సాగునీరు, ఉచిత విద్యుత్ అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నాయకులు మండిపడ్డారు. రైతుభరోసా, రైతుబీమా నిధులు విడుదల చేయకపోవడంతో పాటు మార్కెట్లలో ఎరువుల కొరతతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఇచ్చిన ప్రతి హామీని తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సమన్వయ నాయకులు లోలం శ్యాంసుందర్, రమాదేవి, విలాస్ గాదెవార్, స్థానిక బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేణుకాపూర్ శ్రీ దక్షిణముఖి ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం






బాసర, సెప్టెంబర్ 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): బాసర పుణ్యక్షేత్రం సమీపంలోని రేణుకాపూర్ శ్రీ దక్షిణ ముఖి ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణ, అభివృద్ధి పనులు గురువారం శాస్త్రోక్తంగా ప్రారంభ ్మయ్యాయి. సర్పంచ్ టి. వెంకటేష్ గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పి. సుఖేష్ రావు, వీడీసీ అధ్యక్షుడు ఎన్. లింగారావు ఆధ్వర్యంలో దాతల సహకారంతో పనులను ప్రారంభించారు. ప్రాకార మండపం, రాజగోపురాలు, క్యూ కాంప్లెక్స్, గర్భ గుడి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. భక్తులు, దాతలు నిర్మాణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు పి. సాయినాథ్ పటేల్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గురుస్వామి, జ్ఞాని పటేల్, భీంరావు, పద్మారావు, విజయరావు, గంగాధర్, మల్కన్న, పీరన్‌రావు, రమేష్ పాల్గొన్నారు.

## లక్ష్మణచాందలో కోతుల బెడద నివారించాలని తహశీల్దార్‌కు జేఏసీ వినతి



లక్ష్మణచాంద, సెప్టెంబర్ 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): లక్ష్మణచాంద గ్రామంలో విపరీతంగా పెరిగిపోయిన కోతుల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం తహశీలా ్దర్‌కు వినతిపత్రం అందజేశారు. కోతులు ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను ధ్వంసం చేయడంతో పాటు వీధుల్లో తిరిగే పిల్లలు, వృద్ధులపై దాడులు చేస్తూ తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ అధికారులు వెంటనే ప్రత్యేక బృందాలతో కోతులను బంధించి సుదూర అటవీ ప్రాంతాల్లో విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధికార ప్రతినిధి ముద్రబోయిన వినేష్, తోకల భీమేష్, శ్రీనివాస్, ప్రవీణ్, సాయందర్, గంగాధర్, సందీప్, అశోక్ పాల్గొన్నారు.




## మరణంపై మళ్లీ న్యాయ వైద్య పరీక్ష!

దశకు చేరుకుంది.మృతికి సంబంధించిన అంశాలపై అనుమానాలు ఉన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న వైద్య, న్యాయ వైద్య ఆధారాలను మరింత లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని కోర్టు భావించినట్లు సమాచారం. ఈ మేరకు సంబంధిత వైద్య నిపుణుల నుంచి తాజా అభిప్రాయం తీసుకోవాలని పోలీసులకు సూచించినట్లు తెలుస్తోంది.మరణానికి అసలు కారణం, అందుకు దారితీసిన పరిస్థితులు, అందుబాటులో ఉన్న వైద్య ఆధారాల మధ్య ఉన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని దర్యాప్తును ముందుకు తీసుకెళ్లాలని కోర్టు ఆదేశించింది. గతంలో నిర్వహించిన వైద్య పరీక్షలతో పాటు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధారాలను కూడా నిపుణులు పరిశీలించే అవకాశం ఉంది.ఒక వ్యక్తి మృతి సహజ మరణమా, లేక ఇతర కారణాలతో జరిగిందా అనే అంశంలో స్పష్టత తీసుకురావడానికి న్యాయ వైద్య పరీక్షలు కీలకంగా మారతాయి. అందువల్ల తాజా వైద్య అభిప్రాయాన్ని









## లోకేశ్వరంలో ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు భూమిపూజ



లోకేశ్వరం, సెప్టెంబర్ 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): లోకేశ్వరం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసిన నూతన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు సర్పంచ్ ధార్వాడి కపిల్ గురువారం శాస్త్రోక్తంగా భూమిపూజ చేసి ప్రారంభించారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని సర్పంచ్ తెలిపారు. మంజూరైన ఇళ్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని సకాలంలో నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చే బిల్లులు ఎప్పటికప్పుడు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ, గ్రామ ఉపసర్పంచ్, మండల కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వశిష్ట పాఠశాలలో ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



నిర్మల్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ పట్టణంలోని వశిష్ట ఉన్నత పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను గురువార ం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవర ణలోని శ్రీకృష్ణుని ప్రతిమకు ప్రత్యేక పూజలు చేసి హారతి ఇచ్చారు. విద్యార్థినీ విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో చేసిన నృత్యాలు, చిన్నారుల ఆటపాటలు చూప రులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చిన్నా రులు సంస్కృతి, సాంప్రదాయాలను తెలుసు కునేలా ఇలాంటి పండుగలను నిర్వహిం చడం అభినందనీయమని పాఠశాల చైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ముధోల్ ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు





ముధోల్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): మండల కేంద్రమైన ముధోల్‌లోని రవీంద్ర, శ్రీ అక్షర, సంకల్ప వ్యాలీ, లిటిల్ ఫ్లవర్ పాఠశాలల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. రాధాకృష్ణుల చిత్రపటానికి ప్రిన్సిపాళ్లు అసంవార్ సాయినాథ్, సుభాష్, శేషరావు రాథోడ్, నజీబ్, ప్లేస్కూల్ ఇన్‌చార్జ్ హేమలత ప్రత్యేక పూజలు చేసి ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలతో అలరించి చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. భగవాన్ శ్రీకృష్ణుడు గీతలో బోధించిన ధర్మ మార్గం మానవాళికి నిత్య ప్రేరణ అని ప్రిన్సిపాళ్లు పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, పండుగల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బాసర మండల ప్రభుత్వ బడుల్లో ఘనంగా కృష్ణాష్టమి



బాసర, సెప్టెంబర్ 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): బాసర మండలంలోని ఓని, కౌట, కిర్గుల్ తదితర ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలల్లో రాధాకృష్ణుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఓని ప్రైమరీ స్కూల్ హెచ్ఎం శ్రీధర్‌తో పాటు ఉపాధ్యాయులు పూజలు చేసి ఉట్టి కొట్టే సంబరాలను ప్రారంభించారు. విద్యార్థులు గోపికలు, బాలకృష్ణుడి వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శ్రీకృష్ణుడు విశ్వగురువని, ఆయన చెప్పిన భగవద్గీత బోధనలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని ఉపాధ్యాయులు సూచించారు. గ్రామాల్లోని ప్రైవేటు పాఠశాలల్లోనూ ఈ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.











## అర్హులైన లబ్ధిదారులకు నూతన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ

ముధోల్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ మండల పరిధిలోని అష్ట, బోరిగాం, మచ్కాల్ గ్రామాల్లో గురువారం నూతన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా అర్హులైన పేద కుటుంబాలకు సర్పంచులు రావుల లావణ్య శ్రీనివాస్, కిష్టయ్య, ఆత్మస్వరూప్ కార్డులను అందజేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను నిరుపేదలకు నేరుగా చేర్చేందుకే డిజిటల్ కార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్డులతో రేషన్ దుకాణాల ద్వారా సరుకులు పొందడం మరింత సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, రేషన్ డీలర్లు, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.





## పోగొట్టుకున్న పర్సును ప్రయాణికురాలికి అప్పగించి నిజాయితీ చాటిన కండక్టర్

నిర్మల్, సెప్టెంబర్ 3 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలు మర్చిపోయిన నగదు పర్సును క్షేమంగా బాధితురాలికి అందజేసి నిర్మల్ డిపో కండక్టర్ నిజాయితీని చాటుకున్నారు. నిర్మల్ బస్టాండ్ నుండి ఓలా వెళ్తున్న బస్సులో దిలావర్‌పూర్‌లో ఎక్కిన ఓ మహిళ ఓలాలో దిగిపోయారు. ప్రయాణికులు దిగిన తర్వాత బస్సును పరిశీలించిన కండక్టర్ కళ్యాణికి చివరి సీటు కింద



ఒక పర్సు కనిపించింది. అందులో రూ. 5,010 నగదుతో పాటు రెండు ఆధార్ కార్డులు ఉండటాన్ని గమనించారు. వెంటనే కార్డుపై ఉన్న ఫోన్ నంబర్ ఆధారంగా ప్రయాణ ికురాలిని పిలిపించి పర్సును అప్పగిం చారు. నిజాయితీ ప్రదర్శించి న కండక్టర్ కళ్యాణి, డ్రైవర్ మొబిన్ లను నిర్మల్ డిపో మేనేజర్ కె. పండ˴రి ప్రత్యేకంగా అభినందించారు.5

# సురేఖ బర్తరఫ్.. స్వయంకృతాపరాధమే

### కుటుంబ సభ్యులను అదుపులో పెట్టుకోలేకపోయారు: ఆది శ్రీనివాస్

హైదరాబాద్, సెప్టెంబర్ 3: తెలంగాణ వెన్నెల వాక్కు

మంత్రి పదవి నుంచి కొండా సురేఖను తొలగించడం ఆమె స్వయంకృతాపరాధమేనని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం ఆమెకు అనేక అవకాశాలు ఇచ్చినప్పటికీ వాటిని సద్వినియోగం చేసుకోలేదని విమర్శించారు. సురేఖ బర్తరఫ్ అనంతరం ఆమె చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ ఆది శ్రీనివాస్ ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు.

కొండా సురేఖ తన కుటుంబ సభ్యులను అదుపులో పెట్టుకోవడంలో విఫలమయ్యారని ఆది శ్రీనివాస్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై పదేపదే విమర్శలు చేయడం ద్వారా పార్టీని, ప్రభుత్వాన్ని బలహీనపర్చే పరిస్థితి తీసుకొచ్చారని అన్నారు. ఆమె వ్యవహారశైలిని పార్టీ అధిష్ఠానం, కాంగ్రెస్ అగ్రనేతలు సమగ్రంగా పరిశీలించిన అనంతరమే క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధిష్ఠానాన్ని బెదిరించి లేదా ఒత్తిడి చేసి సురేఖపై చర్యలు తీసుకునేలా చేశారన్న ఆరోపణలను ఆది శ్రీనివాస్ ఖండించారు. "సురేఖను బర్తరఫ్ చేయడానికి సీఎంకు ఆ అవసరమేంటి?" అని ప్రశ్నించారు. ఈ నిర్ణయం వ్యక్తిగతంగా ముఖ్యమంత్రి తీసుకున్నది కాదని, పార్టీ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అధిష్ఠానం నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు.

గతంలోనూ ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు వచ్చిన సందర్భాల్లో రేవంత్‌రెడ్డి సర్దుకుపోయారని, ఈసారి కూడా ముఖ్యమంత్రి స్వయంగా ఎక్కడా స్పందించలేదని ఆది శ్రీనివాస్ అన్నారు. అయినప్పటికీ పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగించేలా వరుసగా పరిణామాలు చోటుచేసుకోవడంతో అధిష్ఠానం కఠిన నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు.

"సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై గౌరవం ఉంటే కాంగ్రెస్ పార్టీని బలహీనపరిచే ప్రయత్నాలు ఎందుకు చేశారు?" అని సురేఖను ఆయన ప్రశ్నించారు. పార్టీ క్రమశిక్షణకు ఎవరూ అతీతులు కారని, ప్రభుత్వాన్ని లేదా పార్టీని బలహీనపరిచే చర్యలను అధిష్ఠానం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు.

కొండా సురేఖతో పాటు సీనియర్ నేత చిన్నారెడ్డిని కూడా పదవి నుంచి తప్పించారని ఆది శ్రీనివాస్ గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిన్నారెడ్డి అత్యంత సన్నిహితమైన నాయకుడైనప్పటికీ, పార్టీకి నష్టం కలిగించే పరిస్థితుల్లో ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేదన్నారు. వ్యక్తుల కంటే పార్టీ, ప్రభుత్వం ముఖ్యమనే విషయాన్ని ఈ నిర్ణయం స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు.

మంత్రి పదవి కోల్పోయిన అనంతరం కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చకు దారితీశాయి. తాజాగా ఆది శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలతో ఈ వివాదం మరింత రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. సురేఖపై అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం, ఆమె చేసిన ఆరోపణలు, కాంగ్రెస్‌లో అంతర్గత పరిణామాలు రానున్న రోజుల్లో ఎలాంటి మలుపు తీసుకుంటాయన్నది ఆసక్తికరంగా మారింది



# పాతబస్తీ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్:




తెలంగాణ రాజధాని హైదరాబాద్ సమగ్ర వికాసానికి, ముఖ్యంగా పాతబస్తీ శ్రేయస్సుకు తమ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నగరంలో చేపడుతున్న సంక్షేమ, మౌలిక వసతుల కల్పన కార్యక్రమాలను అడ్డుకోవడానికి ప్రతిపక్షాలు నిరంతరం ప్రయత్నిస్తున్నాయని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పేద వర్గాలకు శాశ్వత నివాసాలు కల్పించే దిశగా నగరవ్యాప్తంగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన ప్రకటించారు. తెలంగాణను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టేందుకు స్పష్టమైన ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు సాగుతుంటే, ప్రతిపక్షాలు మాత్రం అనవసర రాజకీయం చేస్తూ అభివృద్ధి పనులకు అడ్డంకులు సృష్టిస్తున్నాయని విమర్శించారు.

గంగా, యమునా నదుల రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో మద్దతు తెలిపిన భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మరియు భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్), హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టును మాత్రం ఎందుకు వ్యతిరేకిస్తున్నాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నగర పర్యావరణాన్ని కాపాడటానికి, మురికివాడల రూపురేఖలు మార్చడానికి మూసీ పునరుజ్జీవం ఎంతో కీలకమని, దీనిపై ప్రతిపక్షాలు డబుల్ స్టాండ్ పాటిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యకే తొలి ప్రాధాన్యంసమాజంలో ప్రతి ఒక్కరూ ఉన్నత స్థానానికి చేరుకోవడానికి విద్య ఒక్కటే సరైన మార్గమని సీఎం అభిప్రాయపడ్డారు. చదువు కోసం, విద్యా రంగ అభివృద్ధి కోసం బడ్జెట్‌లో నిధులు ఖర్చు చేసే విషయంలో ప్రభుత్వం ఎప్పుడూ వెనుకడుగు వేయదని స్పష్టం చేశారు. ముఖ్యంగా పాతబస్తీకి చెందిన నిరుపేద సోదరీమణులు, యువతులు కేవలం సాంప్రదాయాలకే పరిమితం కాకుండా నాణ్యమైన విద్యనభ్యసించి గొప్ప లాయర్లుగా, ఇంజనీర్లుగా, డాక్టర్లుగా సమాజంలో స్థిరపడాలన్నదే తన ఏకైక ఆకాంక్ష అని తెలిపారు.

ఇదే సందర్భంలో ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీపై వస్తున్న విమర్శలపైనా సీఎం స్పందించారు. అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం పార్టీ దేశానికి వ్యతిరేకమంటూ కొందరు రాజకీయ స్వార్థంతో దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. దేశభక్తి విషయంలో అసదుద్దీన్ ఒవైసీ ఏ మాత్రం తక్కువ కాదని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాని నరేంద్ర మోదీలతో సమానమైన దేశభక్తి ఆయనకు ఉందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

గత ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు

పాతబస్తీలోని సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణంపై గత బీఆర్ఎస్ ప్రభుత్వ తీరును సీఎం రేవంత్ రెడ్డి ఎండగట్టారు. గత నాయకులు కేవలం కొబ్బరికాయ కొట్టి చేతులు దులుపుకున్నారే తప్ప, ఆ వంతెన నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేదని ఆరోపించారు. తాను రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే అక్బరుద్దీన్ ఒవైసీ, అసదుద్దీన్ ఒవైసీలతో ప్రత్యేకంగా సమావేశమై పాతబస్తీ సమగ్ర అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించినట్లు వెల్లడించారు.

"గత ఇన్నేళ్ల పాలనలో ఎంతమంది ముఖ్యమంత్రులు స్వయంగా పాతబస్తీ వీధుల్లోకి వచ్చి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు?" అని సీఎం ప్రశ్నించారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా, తాను స్వయంగా పాతబస్తీ గల్లీల్లో పర్యటించి అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించానని గుర్తుచేశారు.

నిధుల మంజూరుపై ఆఫీసర్లకు స్పష్టమైన ఆదేశాలు

పాతబస్తీ అభివృద్ధికి సంబంధించి ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ లేదా స్థానిక ప్రజాప్రతినిధులు సూచించే ఏ ప్రజాసంక్షేమ పనినైనా తక్షణమే పరిశీలించి నిధులు మంజూరు చేయాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఇతర ప్రాంతాలతో పాటు పాతబస్తీకి కూడా సమాన ప్రాధాన్యం ఇస్తామని, అన్ని వర్గాల సంక్షేమమే తమ ధ్యేయమని తేల్చి చెప్పారు. పాతబస్తీని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే తమ ప్రభుత్వ ముందస్తు లక్ష్యమని తెలిపారు.




## నింగిలోకి జీఎస్ఎల్‌వీ--ఎఫ్17!

కేంద్రం నుంచి ప్రయోగాన్ని చేపట్టేందుకు శాస్త్రవేత్తలు ఏర్పాట్లు చేశారు.

ఈ ప్రయోగానికి సంబంధించిన 27.5 గంటల కౌంట్‌డౌన్ సెప్టెంబర్ 2 రాత్రి ప్రారంభమైంది. కౌంట్‌డౌన్ ప్రక్రియలో భాగంగా రాకెట్‌లోని వివిధ వ్యవస్థలను శాస్త్రవేత్తలు పరిశీలిస్తున్నారు. ఇంధన నింపే ప్రక్రియతో పాటు ప్రయోగానికి అవసరమైన సాంకేతిక ఏర్పాట్లను కూడా దశలవారీగా పూర్తి చేస్తున్నారు.

జీఎస్ఎల్‌వీ--ఎఫ్17 ద్వారా ఈఓఎస్--05 ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. భూమిని పరిశీలించే ఈ ఉపగ్రహం ద్వారా భూ ఉపరితలానికి సంబంధించిన విలువైన సమాచారాన్ని సేకరించనున్నారు. వ్యవసాయం, వాతావరణ పరిస్థితుల అంచనా, భూ వినియోగం, ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ వంటి అనేక రంగాల్లో ఈ సమాచారం ఉపయోగపడనుంది.వరదలు, తుపాన్లు, కరువు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో భూమిపై జరుగుతున్న మార్పులను గమనించేందుకు భూ పరిశీలన ఉపగ్రహాలు ఎంతో కీలకంగా ఉంటాయి. పంటల పరిస్థితి, భూవినియోగ మార్పులు, సహజ వనరులపై కూడా ఉపగ్రహాల ద్వారా సమాచారాన్ని సేకరించే అవకాశం ఉంటుంది.ప్రయోగానికి ముందు అన్ని వ్యవస్థలను శాస్త్రవేత్తలు మరోసారి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. వాతావరణ పరిస్థితులను కూడా నిరంతరం గమనిస్తున్నారు. నిర్దేశిత సమయానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రయోగం
















# నేపాల్‌ను వీడని వరద బీభత్సం

సహాయక బృందాలు విస్తృతంగా గాలింపు చేపడుతున్నాయి. ముఖ్యంగా సొరంగాలు, శిథిల ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం ఆధునిక గాలింపు పరికరాలను వినియోగిస్తున్నారు. భారత్, చైనా, దక్షిణ కొరియాకు చెందిన సహాయక బృందాలు కూడా నేపాల్ సైన్యంతో సమన్వయంతో సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. గాలింపు చర్యల్లో వైమానిక నిఘా పరికరాలు, ప్రత్యేక యంత్రాలను ఉపయోగిస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలకు అవసరమైన ఆహారం, తాగునీరు, వైద్య సామగ్రిని చేరవేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయి.

వరద ఉద్ధృతి తగ్గుతున్న ప్రాంతాల్లో నష్టం అంచనా వేసే ప్రక్రియను కూడా అధికారులు ప్రారంభించారు. దెబ్బతిన్న రహదారులు, వంతెనలను పునరుద్ధరించేందుకు ప్రాథమిక చర్యలు చేపడుతున్నారు. అయితే కొన్ని ప్రాంతాలకు చేరుకోవడం కష్టంగా మారడంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. గల్లంతైన వారి సంఖ్యపై గాలింపు పూర్తయ్యే వరకు స్పష్టత వచ్చే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సహాయక చర్యలను మరింత వేగవంతం చేస్తున్నారు. అవసరమైన సహాయం అందించాలని అంతర్జాతీయ సమాజాన్ని నేపాల్ ప్రభుత్వం కోరుతోంది.




# క్షిపణి దాడిలో తెలంగాణ వాసి మృతి

గ్రామానికి చెందిన మరో వ్యక్తితో కలిసి నిర్మాణ పనుల కోసం సుమారు నాలుగు నెలల క్రితం కంపెనీ వీసాపై ఉక్రెయిన్‌కు వెళ్లారు. అక్కడ నిర్మాణ రంగంలో పనిచేస్తూ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు.

ఇటీవల క్షిపణి దాడుల సమయంలో హెచ్చరిక సైరన్లు మోగడంతో ఇద్దరూ తమ నివాస ప్రాంతం నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే సుదర్శన్ వెళ్లిన దిశలోనే క్షిపణి పడటంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఆయనతో ఉన్న వ్యక్తి మాత్రం ప్రమాదం నుంచి బయటపడ్డారు.

ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన తెలంగాణ యువకుడు యుద్ధ పరిస్థితుల్లో ప్రాణాలు కోల్పోవడం కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలోకి నెట్టింది. సుదర్శన్ మృతితో స్వగ్రామంలోనూ విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు ఆయన మృతిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విదేశాల్లో ఉపాధి కోసం వెళ్లే తెలంగాణకు చెందిన కార్మికులు యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడ పనిచేస్తున్న భారతీయుల భద్రతపై కూడా చర్చ మొదలైంది. సుదర్శన్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, మృతదేహాన్ని స్వదేశానికి తరలించే ప్రక్రియపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. మరోవైపు ఉక్రెయిన్‌లో ఉన్న తెలంగాణకు చెందిన వ్యక్తుల పరిస్థితిపై కూడా అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.విదేశాల్లో ఉపాధి కోసం వెళ్లే తెలంగాణకు చెందిన కార్మికులు యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడ పనిచేస్తున్న భారతీయుల భద్రతపై కూడా చర్చ మొదలైంది. సుదర్శన్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.